క్లుప్తంగా

ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ



వయోజనులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మహ్మద్ రఫీ

నాగలాపురం: ఉల్లాస్ వాలంటీర్లకు ఒక రోజు శిక్షణ తరగతులు సోమవారం స్థానిక శక్తి భవనంలో నిర్వహించారు. ఎంపీడీఓ మహ్మద్ రఫీ మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వాలంటీర్ వ్యవస్థ ఎలా పనిచేయాలి? అక్షర వెలుగు..ఇత్యాది అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఏపీఎం చంద్రకళ మాట్లాడుతూ, మండలంలోని 21 పంచాయతీల్లో 428 మంది అభ్యాసకులను గుర్తించామన్నారు. 15 సంవత్సరాలు పై బడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. వాలంటీర్ల పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వయోజన పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉండేలా అధికారులు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రమాదేవి, వెలుగు సీసీలు నాగేంద్ర, సుబ్రమణ్యం, శశికళ, అకౌంటెంట్ హర్షవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు

సత్యవేడు: అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) మహా సభలను చేయాలని తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీ నాగార్జున కోరారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలసి కరపత్రాలు విడుదల చేసి ఆయన మాట్లాడారు. ఈనెల 24, 25న శ్రీకాళహస్తిలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోశాధికారి ప్రతాప్, శంకర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంటలో ఎమ్మెల్యే పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట పట్టణంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు చేశారు. ఆయన సోమవారం రేణిగుంటలో పర్యటించారు. వారపు సంత, బస్టాండు ప్రాంతాల్లో మరుగుదొడ్లు, పార్కింగ్ విషయమై అధికారులకు తగు సూచనలు చేశారు. మరో రెండు రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఈవో మణి, టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ పుష్పనాథన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బొమ్మన దుర్గాప్రసాద్

శ్రీకాళహస్తి: ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్రశాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉమా రామలింగేశ్వర దేవాంగ కల్యాణ మండపంలో బొమ్మన బ్రదర్స్ అధినేత, దేవాంగ నిత్యాన్నదాన సత్రాలు(శ్రీశైలం, తిరుపతి) అధ్యక్షులు బొమ్మన దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

షూ కొలతల్లో తప్పులుంటే సవరించండి



మాట్లాడుతున్న సురేష్

శ్రీకాళహస్తి: విద్యార్థుల షూ కొలతల నమోదులో తప్పులుంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే సవరించుకోవాలని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ సురేష్ సూచించారు. ఆయన సోమవారం పట్టణంలోని పలు పాఠశాలలను ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల పాదాల కొలతలను ఇంచెస్‌లో తీసుకుని సెంటీమీటర్లోకి మార్పు చేయడంతో తప్పులు దొర్లినట్లు గుర్తించారు. తుప్పులు ఉంటే యాప్‌లో వెంటనే సవరించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఉదయం 9గంటలలోపు ఫేషియల్ యాప్‌లో అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేదోక్తం.. మహా కుంభాభిషేకం

ఆలయం వద్ద ఉన్న వాహన మండపం





విజ్ఞానగిరి వద్ద ఉన్న వినాయకస్వామి మండపం





హోమపూజలు చేస్తున్న అర్చకులు



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి వద్ద ఉన్న వినాయకస్వామి ఆలయానికి సోమవారం వేదోక్తంగా మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ మండపాన్ని గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానంతో పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇటీవల పనులు పూర్తయ్యాయి. దీంతో సోమవారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. కలశ స్థాపన చేసి హోమపూజలు చేశారు. మాజీ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, సురేష్, కుమార్, ధన, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆలయం వద్ద గల వాహన మండపంలో కొలువుదీరిన వినాయకస్వామికి మహాకుంభాభిషేకం నిర్వహించారు. - శ్రీకాళహస్తి



వినాయకస్వామి సేవలో అంజూరు తారక శ్రీనివాసులు

కుష్ఠు వ్యాధిపై గ్రామాల్లో అవగాహన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని విప్పమానుపట్టెడ గ్రామంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ సూపర్ వైజర్ కామరాజు సోమవారం కొత్తగా ఏవైనా కేసులు ఉంటే గుర్తించే కార్యక్రమం చేపట్టారు. డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో కొత్త లెప్రసీ కేసులు గుర్తించే ఎల్సీడీసీ కార్యక్రమం 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఆశా టీం, టీం సూపర్‌వైజర్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లినప్పుడు వారి చర్మం మీద ఉన్న మచ్చలు ఇతర కుష్ఠు లక్షణాలు గుర్తించాలని పేర్కొన్నారు. కుష్ఠువ్యాధిగా నిర్ధారణ జరిగితే ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని అటువంటి కలుషిత నీటిని తాగితే డయేరియా వచ్చే అవకాశం ఉందని కనుక నీటిని కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ లక్ష్మీపతి రెడ్డి, ఎస్ఓ నాగేంద్ర కుమార్, ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, ఏఎస్ఎం రెడ్డెమ్మ, యమున, హెచ్‌వి అనూరాధ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం, సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి

సంపన్న వర్గానికేనా ఆర్థికసాయం..?

- కడూరు పంచాయతీలో మృతి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు
- అందులో ఒకరికే ఆర్థికసాయం అందజేసి చేతులు దులుపుకున్న టీడీపీ ముఖ్య నేతలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కడూరు దళితవాడకు చెందిన టీడీపీ నేతలు



బాలాజీ నాయుడి కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతిబాబు

వరదయ్యపాళెం: మండలంలోని కడూరు పంచాయతీలో టీడీపీ నేతల ఆర్థికసాయం కాస్త వివాదాస్పదంగా మారింది. అదే పంచాయతీకి చెందిన కడూరు దళితవాడకు చెందిన కస్తూరయ్య, వెంకటరెడ్డికండ్రిగకు చెందిన బాలాజీ నాయుడు ఇద్దరు కూడా రోజుల వ్యవధిలో ఇటీవల మరణించారు. అయితే రెండు కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఇతర టీడీపీ నేతలు పరామర్శించి వెళ్లారు. తాజాగా ఆదివారం వెంకటరెడ్డి కండ్రిగలో మృతి చెందిన బాలాజీ నాయుడు కుటుంబానికి, సూళ్లూరుపేటకు చెందిన పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు చొరవతో రూ.1.25 లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు మండల సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని ప్రచారం చేసుకున్నారు. అయితే అదే పంచాయతీలో మృతి చెందిన దళితనేత కస్తూరయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో వివక్ష చూపడమేమిటని స్థానిక పంచాయతీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ కూడా సంపన్న వర్గానికి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం చేయడమేమిటని పలువురు ప్రశ్నించారు. ఆది నుండి ఆ పార్టీకి దళితులంటే గిట్టదని, అదే వివక్షను ఆపదలో ఉన్న కస్తూరయ్య కుటుంబంపై చూపారని స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.

ట్రాక్టర్ ఢీ: మహిళకు గాయాలు

సత్యవేడు: ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని అల్లపుగుంట గ్రామం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. సోమవారం నాగలాపురం రీచ్ నుంచి సత్యవేడుకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై నడచి వెళ్తున్న కే.చెంచమ్మ(48)ను ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. ఆమెను తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరుక్కుపోయిన లారీ



వరదయ్యపాళెం: మండలంలోని సత్యవేడు-కడూరు కూడలి ప్రధాన రోడ్డు మార్గంలోని యానాదివెట్టు వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై ఉన్న గుంతలో దిగిన లారీ ఇరుక్కుపోయింది. సోమవారం సాయంకాలం జరిగిన ఈ ఘటనతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర లారీలు, పెద్ద వాహనాలతో రోడ్డుకిరువైపులా బారులు తీరాయి. ఆటోలు, కార్లు మినహాయిస్తే భారీ వాహనాలు వెళ్లలేని విధంగా లారీ రోడ్డుకు అడ్డంగా ఇరుక్కుపోయింది. యానాది వెట్టు మర్రిచెట్టు వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై తరచూ పడే గుంతలు కాస్త బావులుగా మారడంతో అటువైపుగా వెళ్లిన కంటైనర్ లారీ ఇరుక్కుపోయింది. లారీ కింద ఇంజిన్ ప్రాంతంలో కట్టలు తొలగిపోవడంతో వాహనం ముందుకు కదల్లేదు. దీంతో లారీని క్రేన్ సాయంతో వెలికి తీస్తే గానీ ట్రాఫిక్ పునరుద్ధరించలేని పరిస్థితి కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నపాటి వాహనాలను రోడ్డు దాటించే ప్రయత్నం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. తిరుపతి డివిజన్ తనిఖీదారులు ఫణిరాజశయన్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 81 రోజులకు గాను రూ.9,34,990లు, అన్నదానం హుండీ లెక్కింపులో రూ.1,39,971, విదేశీ కరెన్సీ యూఎస్ఏ 55 డాలర్లు, సింగపూర్ 16 డాలర్లు, మలేషియా నుంచి 66 ఆర్ఎం, కెనడా 10 డాలర్లు, సింగపూర్ 16 డాలర్లు, కువైట్ 10 దినార్లు వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు



చెత్త నుంచి సంపద కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న షణ్ముగం

సాక్షి ఎఫెక్ట్..

నారాయణవనం: అరుణానది కాలుష్యానికి గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి షణ్ముగం తెలిపారు. మండల కేంద్రం నుంచి తరలిస్తున్న చెత్త, రంగు పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు నదిలో కలిసి కాలుష్యం బారిన పడుతోందని సోమవారం సాక్షి ।నది చెంత– చెత్త చింత౹ శీర్షికన సోమవారం ప్రచురించిన కథనంపై పంచాయతీ కార్యదర్శి స్పందించారు. సంపద సృష్టి కేంద్రాన్ని, చెత్త పేరుకుపోయిన ప్రాంతాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నారాయణవనంలో రంగు పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేవన్నారు. చర్యల నిమిత్తం కాలుష్య నియంత్రణ బోర్డుకు సిఫారసు చేసినట్లు చెప్పారు. రోజూ నాలుగు ట్రక్కుల చెత్త నుంచి తడిచెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్, పేపర్ వ్యర్థాలను వేరుచేస్తున్నట్లు చెప్పారు. వేరు చేయడానికి సాధ్యం కాని చెత్తను వేయడానికి స్థలం చాలడం లేదని, కంపోస్ట్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌ను కలిసి కోరినట్లు చెప్పారు.

పశు వైద్య శిబిరాలు ప్రారంభం



బండారుపల్లిలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం బండారుపల్లిలో సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పశు ఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో నిర్వహించే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యదాయకమైన పాడి సంపదను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. పాడి రైతులు గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పశువులు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సునీత, మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ శిల్పారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, పొన్నారావు పాల్గొన్నారు.

రీసర్వే ప్రారంభించిన ఎమ్మెల్యే

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని సోమవారం ఏర్పేడు మండలం నాగంపల్లిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. సర్వే పక్కాగా జరగాలని సూచించారు. తహసీల్దార్ భార్గవి, డీటీ రోజారమణి, టీడీపీ నాయకులు పేరం ధనంజయులునాయుడు పాల్గొన్నారు.

టీడీపీలో సహకార సంఘం త్రిసభ్య కమిటీ చిచ్చు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండలంలోని కడూరు సహకార సంఘం సొసైటీకి చెందిన త్రిసభ్య కమిటీ చైర్మన్ కుర్చీ కోసం మండల టీడీపీలో రగడ మొదలైంది. అటు పెద్ద పాండూరుకు చెందిన యాదవ సామాజిక వర్గం నుంచి బీసీ సీనియర్ నేత, అటు అంబూరుకు చెందిన రెడ్డి సంపన్న వర్గానికి చెందిన వ్యక్తుల మధ్య ఈ కుర్చీ కొట్లాట మొదలైంది. ఈ అంతర్గత రగడ రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కడూరు సహకార సంఘం సొసైటీకి చెందిన త్రిసభ్య కమిటీ నామినేట్ కానుండడంతో ఆ పదవికి యువ నాయకుడిని సిఫార్సు చేస్తూ స్థానిక ఎమ్మెల్యే ద్వారా పార్టీ హైకమాండ్‌కు నివేదిక వెళ్లిన వార్త బహిర్గతమైంది. దీంతో పెద్ద పాండూరు గ్రామ నివాసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీ కడూరు సహకార సంఘం వైస్ చైర్మన్ ఈ పదవి కోసం కొన్నిరోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే తనను కాదని మరొకరికి ఆ పదవిని ఎంపిక చేస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం సామాజిక మాధ్యమాల్లో అసమ్మతి జ్వాలలు ఎగసిపడ్డాయి. బీసీల పార్టీగా చెప్పుకునే టీడీపీలో సంపన్న వర్గాలకే కొమ్ము కాస్తారా? అని ప్రశ్నించారు. అంతేకాక తాను 30ఏళ్లకు పైగా పార్టీకి సేవ చేశానని బీసీ నేత వాపోయాడు. అంతేకాక సంతవేలూరుకు చెందిన మరో సీనియర్ నేత ఈ పదవి కోసం పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అయితే నియోజకవర్గ టీడీపీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల రీత్యా ఈ పదవిని ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి మరి.

పక్కాగా సామాజిక తనిఖీ

రేణిగుంట(ఏర్పేడు): మండలంలో 2023-24లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో సామాజిక తనిఖీ పక్కాగా జరగాలని ఎంపీడీవో సౌభాగ్యం ఆదేశించారు. ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 17వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నినిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులకు కూలీల రూపంలో రూ.8,54,64,276, మెటీరియల్ రూపంలో రూ.1,85,58,097 ఖర్చు చేశామన్నారు. సిబ్బంది గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించి తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ కావేరి తిరుమలయ్య, ఎస్‌టీఎం కొనయ్య, ఎస్ఆర్‌పీ వెంకయ్య, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

హరహరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా హర హర తీర్థంలో వెలసిన అన్నపూర్ణ సమేత శ్రీహర హరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ పూజల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయనను ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు.

మృత్యుదారి!

- రేణిగుంట-కడప మార్గం గుంతలమయం
- వాహన రాకపోకలకు ఇబ్బందికరం
- ఆదమరిస్తే గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- అమలుకు నోచుకోని నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు

రేణిగుంట: 'రేణిగుంట-కడప జాతీయ రహదారిలో అడుగడుగునా గుంతలు ఉండడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డుకు నిలువెల్లా గాయాలను పోలిన గోతులు ఏర్పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దేవుడిపై భారం వేసి ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. సంక్రాంతికల్లా రోడ్లను బాగుచేస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలు కావడంతో అధ్వాన్నపు రోడ్లపై వాహనదారుల ఫీట్లు పడుతున్నారు. రేణిగుంట- కడప మధ్య దూరం 123 కిలోమీటర్లు. ఈ మార్గం గుండా ప్రధానంగా వైఎస్సార్ కడప, కర్నూల్, హైదరాబాద్ ఇతర తెలంగాణ జిల్లాల నుంచి ఎక్కువగా తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, అరుణాచలం వంటి పుణ్యక్షేత్రాలకు భక్తులు రాకపోకలు సాగిస్తారు. అయితే ఈ మార్గంలో రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తిగా నాలుగులేన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి

ఈ మార్గంలో నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్రం రూ.1,245 కోట్లు మంజూరు చేసినా, కేవలం రూ.64 కోట్లు మాత్ర మే ఖర్చు చేసి కొంత దూరం పనులు చేశారు. అయితే అంతటితో పనులు ఆగిపోవడంతో రోడ్డు దుస్థితికి చేరింది. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. రేణిగుంట-కడప రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గతంలో అనేకమార్లు వైఎస్సార్ సీపీ పార్లమెంటు సభ్యులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం.

నిలువెల్లా గాయాలే!

ఈ మార్గంలో వర్షాలకు రహదారి పూర్తిగా తారులేచి గుంతలమయంగా మారింది. ప్రయాణికులు ఆదమరిస్తే ప్రాణాలు గాల్లో కలసిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల ప్యాచ్ వర్కులు అక్కడక్కడా వేసినా నాణ్యత లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్నాయి. దీనికితోడు ఈ మార్గంలో ఎక్కువగా లారీలు ఇతర రాష్ట్రాల నుంచి చెన్నై, బెంగళూరులకు వస్తుంటాయి. వీటిని ఎక్కడపడితే అక్కడ రోడ్డు మీద ఆపేస్తుండడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 149 ప్రమాదాలు జరిగాయి. 92 మంది మృత్యువాత పడ్డారు. 197 మంది గాయపడ్డారు.



రేణిగుంట-కడప మార్గం మామండూరు సమీపంలో రోడ్డు దుస్థితి